క్లుప్తంగా

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే మండలస్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ దాసరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ పోటీల్లో మండలంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు 355 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్టు తెలిపారు. వీరిని అండర్ 14, అండర్ 17 కేటగిరీలుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండలస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, చదరం చంటిబాబు, కుర్ల చినబాబు, ప్రభాకర్, కాళ్ల వెంకటేష్, బొండా అరుణ పాల్గొన్నారు.

హత్య కేసుపై విచారణ



భీమవరపుకోటలో హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ లతాకుమారి

కోటనందూరు: మండలంలోని భీమవరపుకోటలో వ్యక్తి హత్య జరిగిన ప్రాంతాన్ని గురువారం పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్సై రామకృష్ణతో కలిసి పరిశీలించారు. హత్యపై స్థానిక అధికారులు, అక్కడ ప్రజలను ఆరా తీశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం శివపురానికి చెందిన గంటా రాజు (35)ను భీమవరపుకోట శివారులో తలుపులమ్మ తల్లి గుడికి వెళ్లే ప్రాంతంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో పొడిచి హత్య చేసిన విషయం విదితమే. దీనిపై కోటనందూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ ఘటనలో మండలంలోని ఎస్సార్‌పేట గ్రామానికి చెందిన ముగ్గురి యువకుల పాత్ర ఉన్నట్లుగా స్థానికంగా పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

సిరిపురంలో పొలంబడి



సిరిపురంలో రైతులకు కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏఓ జ్యోతి

ఏలేశ్వరం: వరిపంటను ఆశించే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి సూచించారు. మండలంలోని సిరిపురంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరి పంటను ఆశించే తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారుమడి దశ నుంచి నాట్లు వేసే దశ వరకు ఆకుఎండు తెగులు వస్తుందన్నారు. దీని నివారణకు ఉల్లి, వెల్లుల్లి పంచపత్ర కషాయం బాగా పని చేస్తుందన్నారు. కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఎకరాకు 150 లీటర్ల చొప్పున ఈ కషాయం పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో విద్యార్థులకు అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ కంప్యూటింగ్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధి ఎల్.లోవరాజు విద్యార్థులకు శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో డీన్ అడ్మిన్ వైఎస్ సుబ్బారావు, ఎన్.కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రీడా పోటీలు ప్రారంభం

రౌతులపూడి: మండలంలో ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు ఎంఈఓ-2 గాడి కొండబాబు గురువారం తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చదరంగం వంటి ఏడు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. శుక్రవారం బాలురుకు, శనివారం బాలికలుకు పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

వర్షంతో ఉపశమనం

తొండంగి: వేసవిని తలపించేలా కాస్తున్న ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు గురువారం సాయంత్రం కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. వారం క్రితం వరకూ కుండపోత వర్షాలు, వరదలతో సతమతమైన ప్రజలు నాలుగు రోజులుగా వేసవిని తలపించేలా ఉన్న అధిక ఉష్ణోగ్రతలతో విలవిల్లాడారు. కాగా గురువారం సాయంత్రం మెట్ట ప్రాంతంలో మోస్తారుగా వర్షం కురిసి వాతావరణం కాస్త చల్లబడటంతో ప్రజలు సేదతీరారు.

టీడీపీ శ్రేణుల కక్ష సాధింపు

శంఖవరం: వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై టీడీపీ కార్యకర్తలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటేశారనే అక్కసుతో దౌర్జన్యానికి దిగారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని వజ్రకూటం గ్రామానికి చెందిన కీర్తిరాణి గత ప్రభుత్వంలో ఇచ్చిన జగనన్న ఇంటిలో ఆరు నెలలుగా నివాసం ఉంటోంది. గురువారం గ్రామంలో జరుగుతున్న వినాయక నిమజ్జనంలో పాల్గొనేందుకు రాణి ఇంటికి తాళం వేసి వెళ్లింది. తిరిగి వచ్చే సరికి అదే గ్రామానికి చెందిన కీర్తి కృష్ణ, కేళంగి బాబీలు కలిసి ఇంటి ప్రహరీ కూల్చేశారు. ఎందుకు కూల్చేస్తున్నారని ప్రశ్నించగా ఈ స్థలం మాది, ఎవరు అడ్డొచ్చినా చంపేస్తామంటూ బెదిరించారు. ఆ మేరకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు రాణి తెలిపారు.

మహిళకు తీవ్ర గాయాలు

కిర్లంపూడి: బైక్‌తో గుద్దిన ఘటనలో ఓ మహిళకు తీవ్ర గాయాలైనట్టు స్థానిక ఎస్సై జి.సతీష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే..బూరుగుపూడి ఎస్సీపేటకు చెందిన గుద్దేటి పద్మావతి ఇంటికి అదే గ్రామానికి చెందిన సింబోతుల గణికమ్మ ఆమె ఆడపడుచు నూకమ్మ, కూతురు మరియమ్మ ముగ్గురూ వెళ్లి నిన్ను తిట్టామని ఎవరితోనో చెప్పావంట కదా అని గొడవ పడ్డారు. మరియమ్మ తన సోదరుడు ప్రసాద్‌కు ఫోన్ చేసి గొడవ చెప్పడంతో మోటార్ సైకిల్‌పై వచ్చి నిలబడి ఉన్న పద్మావతిని గుద్దడంతో ఆమె కింద పడిపోయింది. దీంతో ఆమె ఎడమ చెంపపై గాయమైంది. ఆమెను ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ట్రస్ట్ హాస్పటల్‌కు తరలించారు. దీనిపై పద్మావతి కుమార్తె గుద్దేటి స్నేహలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పిచికారీ.. జాగ్రత్తలు తప్పనిసరి

- వరదలకు దెబ్బతిన్న ఖరీఫ్ పంటలు
- సస్యరక్షణ చర్యల్లో రైతులు బిజీ
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న అధికారులు



వరి పంటకు మందు స్ప్రేయింగ్ చేస్తున్న రైతు

ప్రత్తిపాడు రూరల్: వాయుగుండం ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వరద నీరు ముంచెత్తడంతో వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఎక్కువ రోజులు నీటిలో నానడంతో పంటలను తెగుళ్లు ఆశిస్తున్నాయి. వీటి నివారణకు రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. కాగా మందుల పిచికారీలో రైతులు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లో ఈ ఏడాది 49,758 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరి పంటను సాగు చేశారు.

మందుల పిచికారీలో జాగ్రత్తలు ఇలా..

- రెండు లేక మూడు రకాల మందులను కలిపి పిచికారీ చేయకూడదు.
- చేతులకు గ్లౌజులు, కళ్లకు అద్దాలు, ముక్కుకు మాస్క్‌ను తప్పనిసరిగా వినియోగించాలి.
- పురుగు మందుల డబ్బాలను నోటితో తీయకూడదు.
- పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను పెద్దగా చేయకూడదు.

పిచికారీ చేసే మందు సన్నగా.. తుంపరలా పడేలా చూసుకోవాలి.

- మోతాదు ప్రకారమే మందు కలుపుకోవాలి.
- గాలి వాలుకు ఎదురుగా ఉండి పిచికారీ చేయకూడదు.
- పిచికారీ చేసేటప్పుడు ఆహారం తినడం, తాగడం, పొగతాగడం, కళ్లు నులుముకోవడం, నోటిలో వేళ్లను పెట్టుకోవడం వంటివి చేయకూడదు. గాయాలైన చేతలతో మందులను తాకకూడదు.

సూచనలు పాటిస్తే మంచి దిగుబడులు



ఏ పంటకైనా మొదటి 45 రోజుల్లో వచ్చే రోగాలను తట్టుకునే సామర్థ్యం ఉంటుంది. పంటలకు అవసరం మేరకే మందులను వినియోగించాలి. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలను పాటిస్తే ఆశించిన దిగుబడి వస్తుంది.

–వైవీ గంగాధర్, వ్యవసాయశాఖ అధికారి, ప్రత్తిపాడు

రైతులకు సలహాలు ఇస్తున్నాం

రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగుపై సలహాలను అందిస్తున్నాం. ఏ సమయంలో ఎంత మోతాదులో మందులను ఉపయోగించాలో తెలియజేస్తున్నాం. నాణ్యమైన మందులు, ఎరువులను కూడా ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచుతున్నాం. రైతులు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. అవసరం మేరకే మందులు వినియోగించాలి.

–సీహెచ్ గణేష్, వీహెచ్ఏ, పెద్దిపాలెం

వరద బాధితులకు చేయూత



విజయవాడకు నిత్యావసరాలు తరలిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

తుని: విజయవాడలో వరద బాధితులకు రోటరీ క్లబ్, రెడ్డి సంక్షేమ సంఘం అండగా నిలిచాయని క్లబ్ తుని శాఖ కార్యదర్శి కె.కిశోర్‌రెడ్డి తెలిపారు. వరద బాధితులకు గురువారం తుని నుంచి వ్యాన్‌లో నిత్యావసర సరకులు, వస్తువులను పంపించారు. ఈ సందర్భంగా కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ స్నేహితులు, రోటరీ క్లబ్ సభ్యులు, రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు కలిసి రూ.3.40 లక్షలు సేకరించి 30 గ్యాస్ స్టవ్‌లు, 100 స్టీల్ సామగ్రి కిట్లు, 150 దోమ తెరలు, 300 దుప్పట్లు, 100 టవల్స్ ఇతర సామగ్రిని కొనుగోలు చేసినట్టు తెలిపారు. వీటిని 300 బాధిత కటుంబాలకు అందజేస్తామన్నారు. దీంతో పాటు 20 కుటుంబాలకు రూ.80 వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్నామని చెప్పారు. శుక్రవారం విజయవాడలో వరద బాధితులకు అందిస్తామన్నారు. సాయి అన్నపూర్ణ వృద్ధాశ్రమం, సరస్వతీ విద్యాసేవా సమితి ఉపాధ్యాయుడు నాగ భూషణం దుప్పట్లు, టవల్స్, స్టీల్ క్యారేజీలు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు సీహెచ్ మంగరాజు, వీర్రాజు, టి.నాగిరెడ్డి, ఎస్.సురేష్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, మణికంఠ రెడ్డి, గోపాలరావు, మల్లీశ్వరి పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించకపోతే చర్యలు



బాణసంచా తయారీదారులకు సూచనలిస్తున్న అధికారులు

గండేపల్లి: బాణసంచా తయారీలో జాగ్రత్తలు పాటించకపోతే చర్యలు తప్పవని జాయింట్ యాక్షన్ టీం ఎస్సై యువి శివనాగబాబు, డిప్యూటీ తహసీల్దార్ దివ్యభారతి హెచ్చరించారు. గండేపల్లిలో బాణసంచా తయారీ కేంద్రాన్ని గురువారం వారు పరిశీలించారు. బాణసంచా తయారీదారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వారి వెంట వీఆర్వో క్రిష్ణ, అగ్నిమాపక సిబ్బంది ఉన్నారు.

గంగమ్మ ఒడికి గణపతి



ప్రత్తిపాడులోని గణపతి ఊరేగింపులో సందడి చేస్తున్న యువత

- ఘనంగా వినాయక నిమజ్జనాలు
- ఊరేగింపులో సందడి చేసిన యువత

ప్రత్తిపాడు: వినాయక చవితి ఉత్సవాలు ముగియడంతో స్థానిక గోకవరపు వీధిలో ప్రతిష్ఠించిన గణపతి విగ్రహాన్ని గురువారం నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఆశీనులు గావించి గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, భాజాభజంత్రీలు, తీన్‌మార్, బాణసంచా కాల్పుల ఊరేగింపు కన్నులపండువగా జరిగింది. అనంతరం స్థానిక పుష్కర కాలువలో స్వామివారిని నిమజ్జనం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో నిమజ్జనోత్సవాలు వైభవంగా జరిగాయి.

నరేంద్రగిరిని మరో భద్రాచలంగా తీర్చిదిద్దుతాం

శ్రీరామనామ క్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామనామ క్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు సుబ్బారావు

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై ఉన్న నరేంద్రగిరిని దాతల సహకారం రూ.2 కోట్లతో మరో భద్రాచలంగా తీర్చిదిద్దుతామని శ్రీరామనామ క్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి సుబ్బారావు తెలిపారు. స్థానిక నరేంద్రగిరిపై శ్రీమద్ రామాయణ పీఠం ఆధ్వర్యంలో ఆంధ్రా భద్రాద్రి కల్యాణ మండపం నిర్మాణ పనులను గురువారం సూర్య భాస్కరేంద్ర స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్తిపాడులోని నరేంద్రగిరిని ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. దాతల పేర్లను రామ మందిరంపై శాశ్వతంగా పొందుపరుస్తామని చెప్పారు. అనంతరం భజన మండలి సభ్యులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో క్షేత్రం గౌరవాధ్యక్షుడు తేజోమూర్తుల సుబ్రహ్మణ్య శర్మ, ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు రెడ్నం రాజా, గోగుల వెంకటేశ్వరరావు, పత్రి రమణ, చెలంకూరి భాను, సొసైటీ మాజీ అధ్యక్షుడు జువ్వల చినబాబు, గ్రామ ఉప సర్పంచ్ మదినే నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పడాలకు ఘన నివాళులు



వీరభద్రరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అల్లూరి సేవా కమిటీ ప్రతినిధులు

కోటనందూరు: ఇటీవల మృతి చెందిన కోస్తా సమయం దినపత్రిక వ్యవస్థాపకుడు పడాల వీరభద్రరావుకు గురువారం ఘనంగా నివాళులర్పించారు. కోటనందూరులో గురువారం అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ ఆధ్వర్యంలో పడాల సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత పడాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. అల్లూరి సేవాకమిటీ ప్రతినిధులుతో వీరభద్రరావుకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పడాల అల్లూరి సీతారామరాజు నడయాడిన ప్రాంతాల్లో ఆదివాసీలతో మమేకమై అనేక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. పడాల తలపెట్టిన ప్రతి కార్యక్రమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా అభ్యుదయ రచయితల సంఘ కార్యదర్శి వాడపల్లి వెంకటరమణమ్మ, అల్లూరి సేవా కమిటీ ప్రతినిధులు వత్సవాయి నారాయణమూర్తిరాజు, దాడి గోవిందరావు, కేవీపీ సూరిబాబు, మహర్షిరమణ, లక్కాకుల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రత.. ఆరోగ్య భద్రత



ఏలేశ్వరంలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



వేలంకలో మొక్కలు నాటుతున్న డీపీఓ బాలామణి

- జోరుగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు
- గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు

తుని: భక్తుల పాలిట కల్పవల్లి లోవ దేవస్థానంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి పి.విశ్వనాథరాజు తెలిపారు. లోవ దేవస్థానం ప్రాంగణంలో గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణంలోని పలు ప్రాంతాలను శుభ్రం చేశారు. కాటేజీలు, కేశఖండన తదితర ప్రాంతాల్లో తుప్పలను తొలగించారు. భక్తులకు మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని ఈఓ తెలిపారు. దేవస్థానంలో పని చేస్తున్న సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: పట్టణంలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద సుమారు వంద మందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ ఇన్‌చార్జ్ కమిషనర్ అనూషలక్ష్మి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పట్టణంలో పరిశుభ్రతతో పాటు పర్యవరణాన్ని కాపాడేందుకు ప్రజలు సహకరించాలన్నారు. అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో టీపీఓ ఆనంద్‌కుమార్, కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కిర్లంపూడి: గ్రామాల్లో అధికారులు పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డివిజినల్ పంచాయతీ అధికారి ఈఓ ఎం.బాలామణి సూచించారు. మండలంలోని వేలంకలో గురువారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును పరిశీలించారు. షెడ్డు నిర్వాహణపై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎన్.సత్యప్రసాద్, సర్పంచ్ రాయుడు స్వామి తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి



ఒంటిమామిడిలో పాడి రైతులకు పోషకాహార కిట్లను అందజేస్తున్న దివీస్ ప్రతినిధులు

ఏలేశ్వరం: రైతులు పశుసంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. మండలంలోని పేరవరంలో గురువారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మరిన్ని పశువైద్య శిబిరాలు నిర్వహించి రైతులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కర్రి సూర్యప్రకాష్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఒంటిమామిడిలో పశువైద్య శిబిరం

తొండంగి: మండలంలోని ఒంటిమామిడిలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. దివీస్ ల్యాబోరేటరీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ బి.అంబేడ్కర్, వెటర్నరీ డాక్టర్లు ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పశువుల్లో వచ్చే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాల్లో దివీస్ ల్యాబోరేటరీస్ పాడి రైతుల కోసం వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం రైతులకు రూ.2 లక్షల విలువైన పోషకాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో దివీస్ సీనియర్ మేనేజర్ ఆర్.సుధాకర్, పంచాయతీ సర్పంచ్ అంగుళూరి సుధాకర్, దివీస్ సంస్థ ప్రతినిధులు, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుకు గడువు పొడిగింపు

తొండంగి: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు చేసేందుకు ప్రభుత్వం ఈ నెల 23 వరకూ గడువు పొడిగించిందని మండల వ్యవసాయాధికారి ఎస్.నరసింహం గురువారం తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు అందాయన్నారు. ఇప్పటివరకూ ఈ-క్రాప్ నమోదు చేయించుకోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నష్టం వివరాలు సరిచూసుకోవాలి



కృష్ణునిపాలెం సచివాలయంలో పంట నష్టం వివరాలు ప్రదర్శిస్తున్న కార్యదర్శి రమణకుమారి

గోకవరం: ఇటీవల వరదల కారణంగా నష్టపోయిన రైతుల పంట వివరాలను ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శనకు ఉంచామని, రైతులు ఆయా వివరాలను సరిచూసుకోవాలని గోకవరం మండల వ్యవసాయశాఖ అధికారి రాజరాజేశ్వరి సూచించారు. మండలంలోని తంటికొండ, రంపయర్రంపాలెం, తిరుమలాయపాలెం, కొత్తపల్లి 2, కామరాజుపేట 1, గోకవరం 1, 2, 3, 4, అచ్యుతాపురం, కృష్ణునిపాలెం, ఇటికాయలపల్లి సచివాలయాల్లో పంట నష్ట శాతం అంచనా వివరాలను ప్రదర్శనకు ఉంచామన్నారు. రైతులు ఈ వివరాలను సరిచూసుకుని ఏమైనా మార్పులు ఉంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

గండేపల్లి: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆదిత్య యూనివర్సిటీ ప్రిన్సిపాల్ కె.రవిశంకర్ కోరారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ పి.ప్రశాంతి, ఎం.శేషసాయి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి భజన పోటీల్లో ప్రథమ స్థానం



ధర్మవరం భజన కళాకారులకు బహుమతిని ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన సత్యశారదా మహిళా భజన సమాజం జిల్లా స్థాయి భజన పోటీల్లో ప్రథమ బహుమతిని కైవసం చేసుకుందని ఆ సంస్థ నిర్వాహకుడు కొప్పిశెట్టి బాబు గురువారం తెలిపారు. గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా పెద్దాపురం మండలం కాండ్రకోటలో నిర్వహించిన జిల్లా స్థాయి భజన పోటీల్లో సత్యశారదా మహిళా భజన సమాజం కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. ఈ ప్రదర్శనలో ప్రథమ స్థానం కైవసం చేసుకోగా నిర్వాహకులు బహుమతిని ప్రదానం చేశారు. విజేతలను గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, మాజీ సొసైటీ చైర్మన్ జువ్వల చినబాబు తదితరులు అభినందించారు.

నేటి నుంచి ప్రజావేదిక

జగ్గంపేట: ప్రజా సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నుంచి ఈ నెల 26 వరకూ ప్రజావేదిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గురువారం తెలిపారు. గ్రామాల్లో ప్రజలు తమ సమస్యలను వినతి పత్రాల రూపంలో తెలియజేయాలని సూచించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

తుని: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత అన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రాజీవ్ గృహకల్ప, తేటగుంట గ్రామాల్లో నిర్వహించిన జాతీయ పౌష్టికాహార మహోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో లభించే పౌష్టికాహారంపై అవగాహన కలిపించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు సీడీపీఓ నిహారిక, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో కాంగ్రెస్ శ్రేణుల నిరసన

ప్రత్తిపాడు: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీపై బీజేపీ, శివసేన నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ప్రత్తిపాడులో గురువారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను మాట్లాడుతూ రాహుల్ గాంధీపై బీజేపీ, శివసేన నాయకులు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలన్నారు. రాహుల్ గాంధీకి వెంటనే వారు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పన కోటేశ్వరరావు, ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి కొల్లు వీరగణేష్, కందిమళ్ల సామ్యేలు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం

కిర్లంపూడి: జగపతినగరంలోని కొండయ్యపేటలో నిర్వహించే శరన్నవరాత్ర ఉత్సవాలకు గురువారం రాట ముహూర్తం చేశారు. ఆలయ అర్చకులు బాదంపూడి వైద్యనాథశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పందిరి రాట వేశారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కొత్తూరు సర్పంచ్‌కు చెక్ పవర్ రద్దు

జగ్గంపేట: మండలంలోని కొత్తూరు గ్రామ సర్పంచ్ నకిరెడ్డి నాగేశ్వరరావుకు చెక్ పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పారిశుధ్య కార్మికులకు జీతభత్యాల చెల్లింపు, పంచాయతీ కార్యదర్శికి షోకాజు నోటీసు జారీ చేయుట తదితర అంశాలపై ఆరోపణల నేపథ్యంలో చెక్ పవర్ రద్దు చేసినట్టు తెలిపారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం

తుని: పట్టణం, తుని పరిసర ప్రాంతాలకు చెందిన పేదలు అన్న క్యాంటీన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు సూచించారు. స్థానిక రాజా రాజబాబు మున్సిపల్ పార్కు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. పలువురికి భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్లు కుసుమంచి శోభారాణి, ఇనుగంటి సత్యనారాయణ, చోడిశెట్టి గణేష్, మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, యనమల రాజేష్, సుర్ల లోవరాజు తదితరులు పాల్గొన్నారు.